ప్రజాశక్తి

సోమవారం 14 నవంబర్ 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా







మహాసభలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

కనీస వేతనం రూ.20 వేలివ్వాలి

- ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు
- యూనియన్ గౌరవాధ్యక్షులుగా శ్రీనివాస్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా భూషణం, సుబ్బారావు ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : గ్రామపంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రూ.20వేల కనీస వేతనం చెల్లించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం నున్నలో ఆదివారం జరిగిన గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా 8వ మహాసభ బి.భూషణం, మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రజలందరికీ ఆరోగ్యాన్నిస్తూ, పరిశుభ్రమైన నీరు, వెలుగునందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలు కొవ్వొత్తుల్లా కరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ చట్టబద్ధమైన సౌకర్యాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైరైన కార్మికులకు ఉద్యోగ విరమణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. పెరుగుతున్న ధరలు, చాలీచాలని ఆదాయంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. కార్మిక చట్టాల అమలుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి హెచ్.సుబ్బారావు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా, సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాల పెంపునకు పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ కష్ణాజిల్లా అధ్యక్షుడు ఎం.పోలినాయుడు మాట్లాడుతూ పంచాయతీ వర్కర్లకు, క్లాప్ మిత్రాలకు (గ్రీన్ అంబాసిడర్లకు) పెండింగ్ వేతనాలు

(మిగతా 6లో)

వ్యవసాయ కార్మికుల ఉపాధికి గండి

- పెరుగుతున్న ఆక్వా సాగు విస్తీర్ణం, వ్యవసాయ యాంత్రీకరణ
- నేడు, రేపు కూచిపూడిలో వ్యకాస కృష్ణాజిల్లా 2వ మహాసభ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పారిశ్రామిక వృద్ధి కొరవడిన కృష్ణాజిల్లాలో అత్యధిక కుటుంబాలు వ్యవసాయరంగంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈరంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు వ్యవసాయ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్‌ఆర్‌ఇజిఎస్)లోనూ కార్మికులకు నిర్దేశించిన పని రోజులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. అడ్డూఅదుపులేకుండా పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు వీరి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి.

నందివాడ, కృత్తివెన్ను, బంటుమిల్లి, మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక మండలాల్లో 80 శాతం భూములు ఆక్వా చెరువులుగా మారాయి. పెదపారుపూడి, గుడ్లవల్లేరు, పెడన, గూడూరు మండలాల్లోనూ క్రమేణా చెరువుల విస్తీర్ణం పెరిగిపోతోంది. జిల్లాలోని 88 వేల ఎకరాల్లో ఆక్వా చెరువులు విస్తరించాయి. గన్నవరం, పెనమలూరు, కంకిపాడు, గుడివాడ, ఉయ్యూరు, హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి. అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న వరిపంటలో ఖర్చులు తగ్గించుకునేందుకు పలు ప్రాంతాల్లో వెద జల్లే పద్ధతిని అనుసరిస్తున్నారు. వరి, అపరాల కోతలు, నూర్పిడిల్లో హార్వెస్టింగ్ యంత్రాలు వినియోగం పెరిగింది. పదేళ్ల క్రితం వరకు కార్మికులకు ఏడాదికి 280 రోజులు పని కల్పించిన వ్యవసాయ రంగంలో ఉపాధికి గండి పడింది. ఏడాదికి 55 రోజులకు తగ్గిపోయింది. ఈపరిస్థితుల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్‌ఆర్‌ఇజిఎస్)లో పూర్తి స్థాయిలో పని కల్పించకపోవడం కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ చట్టం ప్రకారం ఏడాదిలో 100 రోజులపాటు గ్రామీణ పేదలకు ఉపాధి పని కల్పించాలి. అయితే కేంద్రం ఉపాధి నిధుల కేటాయింపుల్లో కోత పెట్టింది. దీని ఫలితంగా ఉపాధి పనుల్లోనూ కోత పడుతోంది. జిల్లాలోని 498 గ్రామాల్లో 17,522 గ్రామైఖ్య సంఘాలున్నాయి. 2,17,234 జాబ్‌కార్డున్న కార్మికులకు ఒక్కొక్కరికి ఏడాదికి సగటున 47 రోజులు మాత్రమే పని కల్పిస్తోంది. దీంతో కార్మికులు పనుల కోసం వలస బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా కార్మికుల రోజు వారి కూలీలో మాత్రం పెద్దగా మార్పు లేకుండా ఉంది. పని దొరికిన రోజుల్లోనూ రోజువారీ కూలి రూ.300 నుంచి రూ.500కు మించడం లేదు. ఉపాధి కార్మికులకు రోజుకు రూ.257 మాత్రమే కూలి చెల్లిస్తున్నారు. రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. చాలీచాలని కూలితో వ్యవసాయ కార్మికుల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. పేదలకు పంపిణీ అయిన వేలాది ఎకరాల ఎస్సైన్డ్ భూములు పెద్దలు ఆక్రమించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికుల సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి.



కృష్ణాజిల్లా మహాసభను విజయవంతం చేయండి

జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్

మొవ్వ మండలం కూచిపూడిలో సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా ద్వితీయ మహాసభ జరుతుంది. ఈ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పెదపూడి పాలకేంద్రం వంతెన సెంటర్ నుంచి కూచిపూడి శాంతి కాంప్లెక్స్ వరకు ప్రదర్శన ఉంటుంది. అనంతరం శాంతి కాంప్లెక్స్ వద్ద బహిరంగ సభ జరుగుతుంది. సంఘం జిల్లా అధ్యక్షులు యద్దనపూడి మధు అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ప్రధానవక్తగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు పాగోలు రమేష్, వ్యకాస జిల్లా అధ్యక్షులు డి.సంగీతరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు తదితరులు ప్రసంగిస్తారు. మహాసభలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేస్తాం.

తనిఖీల ద్వారా కల్తీలకు అడ్డుకట్ట

ప్రజాశక్తితో డైరెక్టర్ ఆఫ్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు





ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో కల్తీల జోరు పెరుగుతోంది. ప్రజారోగ్యం మృగ్యమవుతోంది. ఎంఆర్‌పి ధరల నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. ఆహార పదార్థాల తనఖీలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. వీటన్నింటికీ ఫుడ్ కంట్రోల్ విభాగంలో సిబ్బంది కొరతే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 60 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి కేవలం 45 మంది మాత్రమే ఉన్నారు. నమోదవుతున్న కేసులకు పరిష్కారం కూడా లభించడంలేదు. లైసెన్స్ ఫీజుల రూపంలో రూ.4 కోట్లకుగాను కేవలం కోటి రూపాయలు మాత్రమే రాబడి వస్తోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ ఫుడ్ కంట్రోలర్ (డిఎఫ్‌సి, ఫుల్ అడిషనల్ చార్జి) ఎన్.పూర్ణచంద్రరావును ప్రజాశక్తి ఇంటర్వ్యూ చేసింది. తనిఖీల ద్వారా కొంత వరకు కల్తీలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నామని ఆయన వివరించారు. ఇటీవల నమోదైన కేసుల వివరాలే తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఇంటర్వ్యూ వివరాలిలా ఉన్నాయి.

ప్రశ్న : విఎంసి కౌన్సిల్ సమావేశంలో ఫుడ్ కంట్రోల్ అధికారుల తీరుపై వచ్చిన విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు ?

విజయవాడ నగరంలో కల్తీలు పెరిగిన మాట వాస్తవం. కొంతమంది కల్తీరాయుళ్లు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గత నెల 31న జరిగిన విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు కల్తీల విషయాన్ని ప్రస్తావించారు. తక్షణం పర్యవేక్షణపై దృష్టి పెట్టాలని

(మిగతా 6లో)

పెరిగిన తూనికలు కొలతల శాఖ దాడులు

ఇప్పటికి రూ.60 లక్షల జరిమానా వసూలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ దాడులు ముమ్మరం చేసింది. చౌకధరల దుకాణాలు, వే బ్రిడ్జిలు, రైస్ మిల్లులు, రైస్ షాపులు, హార్డ్‌వేర్ దుకాణాలు, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ షాపులు, డిస్పెన్సరీ యూనిట్లు, వాటర్ ప్లాంట్లు, పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం దుకాణాలు, స్వీట్స్, బేకరీ, కిరాణా షాపులు, జనరల్ స్టోర్స్, పాలు, పాల ఉత్పత్తులు, పరిశ్రమలు, మాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్లతోపాటు పెట్రోల్ పంపులపై అధికారులు దాడులు చేపట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యాన 59,800 షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ చట్టం, ఎల్ఎం ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్ 2011 ప్రకారం నిబంధనలు అతిక్రమించిన దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9452 కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సుమారు రూ.60లక్షల వరకు కాంపౌండ్ ఫీజు కింద వసూలు చేశారు. నమోదైన మొత్తం కేసుల్లో తూనికలు, కొలతల్లో అవకతవకలకు సంబంధించి 226 కేసులు నమోదు చేశారు. తూకం, ఇతర నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సుమారు 3734 కేసులు నమోదు చేశారు. నిర్ణీత ధరల (ఎంఆర్‌పి) కంటే అధిక ధరలకు విక్రయించేవారిపై 1890 కేసులు నమోదు చేశారు. నమోదైన కేసుల్లో సుమారు 2046 కేసులు కిరాణా షాపులకు

(మిగతా 6లో)

పెట్రోల్ బంకులో మోసంపై ఫిర్యాదు



తేడా పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని షేర్ మొహమ్మద్ పేట ఎక్స్ రోడ్డు సాయిబాబా గుడి వద్ద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ తక్కువ పరిమాణంతో పెట్రోల్ బంకు యాజమాన్యం పోస్తూ మోసం చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు చెల్లించే డబ్బుకు పెట్రోల్ రావలసిన పరిమాణం కన్న బాగా తక్కువ పరిమాణం వస్తుందనీ వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పెట్రోల్‌ను ఖాళీ వాటర్ బాటిల్ లో 50 రూపాయలు పెట్రోల్ కొట్టించగా 100 ఎంఎల్ పెట్రోల్ మాత్రమే రావడంతో ఒక్కసారిగా వాహనదారుడు అవాక్కై పెట్రోల్ బంక్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అయినప్పటికీ యాజమాన్యం నుండి సరైన సమాధానం రాకపోవడంతో వాహందారులు జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. పోలీసులు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి తక్కువ పరిమాణంగా వచ్చినటువంటి పెట్రోల్ ను పరిశీలించారు. పెట్రోల్ బంకు ను తనిఖీ చేయాల్సిన అధికారులు పెట్రోల్ బంకులపై అజమాయసి లేకపోవటంతో ఇటువంటి దారుణాలు జరుగుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

కోలాహలంగా వన సమారాధనలు

ప్రజాశక్తి-కంచికచర్ల : కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం మండలంలో పలు చోట్ల కోలాహలంగా వన సమారాధన నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు మహిళలు, పిల్లలతో కలిసి ముఠాల వారీగా వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం అందరూ ఒక చోట పోగయి వంటలు చేసుకుని, ఆటోలు, ట్రాక్టర్ లలో దగ్గరలో ఉన్న మామిడితోటల్లోకి వెళ్ళి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కంచికచర్ల, గొట్టుముక్కల తదితర గ్రామాల నుంచి విద్యార్థులు, వ్యవసాయ కూలీలు గొట్టుముక్కల అటవీ ప్రాంతంలో గల మద్దులమ్మ గుడి వద్దకు వెళ్ళారు. అలాగే మండలంలోని కీసర వద్ద మామిడి తోటల్లో గుంపులు గుంపులుగా జనం చేరి వనసమారాధన నిర్వహించారు. కీసర మునేటిలో యువకులు, పిల్లలు నీటి పాయలో ఆడుతూ పాడుతూ సేద తీరారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ ఎంజిహెచ్ ఉన్నత పాఠశాలకు చెందిన 1979-80 పూర్వ విద్యార్థుల కార్తీక వన సమరాధన ఆదివారం మునేటి ఒడ్డున అమ్మ గార్డెన్ లో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు, బంధువులు,చిన్నారులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆట పాటలతో సంతోషంగా గడిపారు. తమ బాల్యంలో ఆడిన ఆటలతో వయస్సైన కుర్రాళ్ళు చలాకీగా ఆడి పాడారు. పూర్వ విద్యార్థుల నాయకులు శంకరశెట్టి బాచీ,రమేష్, గోపు నరేంద్ర,నాగులు, ప్రసాద్, కనక దుర్గ ,లీల, గోపయ్య తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట పట్టణంలోని బలుసుపాడు రోడ్డు భారతి టౌన్షిప్ మామిడి తోటలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా కాపు వన సమరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను, విమలా భాను దంపతులను సన్మానించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మహిళలు, చిన్నారులు, యువత ఆటపాటలతో వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ ఆడపా శేషు, బొమ్మదేవర సుబ్బారావు, న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాసరావు తదితర కాపు సోదరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉదయభాను దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చెరకు రైతు పరిస్థితి దయనీయం

ఖర్చు బారెడు..ఆదాయం మూరెడు : భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

చెరకు రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఖర్చు బారెడు...ఆదాయం మూరెడు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. కెసిపి చక్కెర కర్మాగారం ఫ్యాక్టరీ డిసెంబర్ ఏడో తేదీ నుంచి చెరకు క్రషింగ్‌కు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో గిట్టుబాటు ధర చెల్లింపు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో చెరకు పంటకు ఫ్యాక్టరీ నిర్ణయించిన ధర ఏ మాత్రమూ చాలదని రైతులు చెబుతున్నారు. తాము తీవ్రంగా నష్టాపోవాల్సి వస్తుందని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖర్చు బారెడు.. ఆదాయం మూరెడు

ఈ సీజన్లో చెరకు సాగు వ్యయం 10 శాతం పెరిగిందని ఫ్యాక్టరీ అంచనా. మొక్క తోటకు రూ.1.10 లక్షలు, పిలక తోటకు రూ.90 వేల వరకు ఖర్చువుతోందని ఫ్యాక్టరీ యాజమాన్యం అంచనా. అయితే ఫ్యాక్టరీ అంచనా కంటే ఎక్కువగానే ఖర్చువుతోందని చెరకు రైతులు చెబుతున్నారు. 2022-23 క్రషింగ్ సీజన్లో టన్ను చెరకు ధర రూ.2,966గా, మరో రూ.400కు ప్రోత్సాహకంగా ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రకటించింది. అన్నీ కలిపితే రైతులకు టన్ను చెరకుకు రూ.3,366 అందుతుంది. ఈ సీజన్లో ఎకరానికి సగటు దిగుబడి 37 టన్నులని ముందస్తు అంచనా. దీనికిగాను రైతులకు వచ్చే ఆదాయం రూ.1.24 లక్షలు, ఏడాదిపాటు కష్టపడి పండించిన సొంత భూమి ఉన్న రైతులకు ఎకరానికి మిగిలేది రూ.14 వేలు మాత్రమే. లక్ష రూపాయల పెట్టుబడికి నూటికి రూపాయి వడ్డీగా నిర్ణయించినా రూ.12 వేలుపోతే చెరకు సాగు ద్వారా ఏడాదికి మిగిలేది రూ.2 వేలు మాత్రమే. ఈ ప్రాంతంలో కౌలు రైతులు ఎకరానికి 17 టన్నులు కౌలు చెల్లించాలి. ఈ కౌలు చెల్లించగా మిగిలిన 20 టన్నులపైన కౌలు రైతులకు వచ్చేది రూ.67,320 మాత్రమే. వచ్చిన ఆదాయం నుంచి ఖర్చులను మినహాయిస్తే కౌలు రైతులు ఎకరానికి రూ.42,680 వరకు నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు రాక అప్పులపాలవ్వాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో చెరకు ధర టన్నుకు రూ.4 వేలుగా నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు. పెరిగిన ఖర్చులను పరిగణలోకి తీసుకుని గిట్టుబాటయ్యేలా ధర ఉండాలని అంటున్నారు.

ఎకరానికి రూ. 1.20 లక్షలు ఖర్చు

వై.బసవరాజు, చెరకు రైతు, హనుమంతపురం, పమిడిముక్కల మండలం

ఈ ఏడాది 5 ఎకరాలు సాగు చేశా. ఎకరానికి 17 టన్నులు కౌలు చెల్లించాలి. ఎరువులు, ట్రాక్టర్ కిరాయిలు అన్నీ పెరిగిపోయాయి. ఎలుకల నివారణకే రూ.10 వేలకుపైగా ఖర్చుపెట్టా. చెరకు ఫ్యాక్టరీకి రవాణా చేయడానికి ఎకరానికి రూ.1.20 లక్షలు ఖర్చువుతోంది. పెరిగిన ఖర్చులను లెక్కలోకి తీసుకుంటే చెరకు పంటకు ఫ్యాక్టరీ నిర్ణయించిన ధర గిట్టుబాటు కాదు.

చెరకు టన్నుకు రూ. 4 వేలివ్వాలి.

రాజులపాటి రామాంజనేయప్రసాద్, చెరకు రైతు సంఘం నాయకులు

చెరకు సాగుకు ఖర్చులు భారీగా పెరిగాయి. ఎకరం సాగుకు రూ.1.20 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈసీజన్లో కెసిపి షుగర్ ఫ్యాక్టరీ నిర్ణయించిన ధర ఏమాత్రమూ చాలదు. ఈ ధరతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. టన్నుకు రూ.4 వేలు చెల్లించాలి. ఎకరానికి రూ.20 వేలు రాయితీ, సబ్సీడీపై ఎరువులు ఇవ్వాలి. గతంలో ఇచ్చిన విధంగానే బ్యాంకుల ద్వారా చెరకు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలివ్వాలి.

కంచికచర్లలో అభివృద్ధి పనులు



కంచికచర్లలో నిర్మాణం జరుగుతున్న కల్వర్టు

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల గ్రామ పంచాయతీలో సచివా లయం 2 పరిధిలో అభివద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక గొట్టు ముక్కల రోడ్డు, వసంత కాలని, హనుమాన్ పేట తదితర ప్రాంతాల్లో కల్వర్టులు, బిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు సచివాలయం 2 పరిధిలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్డు, కల్వర్లు, డ్రైనేజీ సమస్యలు ఆయన దష్టికి తీసుకు వచ్చారు. దీంతో ప్రభుత్వం నుండి సచివాలయం 2 పరిధిలో అభివద్ధి పనులకు 20 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో వసంత కాలని, గొట్టుముక్కల రోడ్డు లో, హనుమాన్ పేట లలో 14 కల్వర్టు, 4 సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఇటీవల నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు శంకుస్థాపన చేశారు. అలాగే కంచికచర్ల మండల పరిషత్ నిధులు 12 లక్షల రూపాయల వ్యయం తో జుజ్జూరు రోడ్డు లో పక్కా డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి కాగా, స్థానిక కంకర బొందల రోడ్డు లో 14 లక్షల రూపాయల వ్యయం పక్కా డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. మరో 20 లక్షల రూపాయలు నిధులతో ప్రాధాన్యత క్రమంలో కల్వర్టులు, సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అభివద్ధి పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం బలరాముని పేట అది వెలమ సంఘం కార్యాలయం వద్ద సూరత్ పాండు రంగారావు రంగమనిల విద్యా నిధి నుండి సూరత్ పాండురంగారావు మచిలీపట్నం విద్యార్థిని అకునూరి పావని ద్వితీయ ఎం బి ఎ (హెచ్ఆర్) ట్యూషన్ ఫీజు క్రింద రూ.43 వేలు చెక్కు అందజేశారు. సూరతు పాండురంగారావు చెక్కు పంపించారని మచిలీపట్నం అది వెలమ సంఘం ప్రెసిడెంట్ పిల్లారి శెట్టి శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో వంధంశెట్టి రాము, మాజీ సెక్రెటరీ, పిల్లారి శెట్టి రాంబాబు

విఆర్ కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ డివిఆర్ కాలనీలో గ్యార్మీ పండుగ సందర్భంగా మసీదులో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఎంఎల్ఏ మొండితోక జగన్మోహనరావు, మాజీ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య పాల్గొని ప్రార్ధనలు నిర్వహించారు. మసీదు పెద్ద ఖలీల్ అహమ్మద్ రజ్వీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు


జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారు. అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. భక్తులకు కావలసిన సౌకర్యాలను అందించినట్లు తెలిపారు

నియామకపత్రం అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లును ఆంధ్రప్రదేశ్ పద్మశాలి బిసి సాధికారిక సమితి డైరెక్టర్ గా నియమించారు. నియామక పత్రాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌లకు వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

విజేతలకు క్రీడాదుస్తులు అందజేత



దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక బాలురు హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన జగనన్న క్రీడ సంబరాలలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో గెలిచిన విజేతలకు ఆదివారం క్రీడా దుస్తులను శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో గెలిచిన క్రీడాకారులు జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతంలోనే ప్రతిభగల క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వారిని వెలికి తీయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మానసిక ఉల్లాసం కోసం క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలపై దష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు 50,000 విలువచేసే పవర్ లిఫ్టింగ్ సెట్టును కేడీసీసీ బ్యాంక్ వారి సహకారంతో అందజేసి అనంతరం పవర్ లిఫ్టింగ్ సెట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నంబురి రవి, సర్పంచ్ సూర్యప్రకాష్, తక్కెళ్ళపాడు సాయి, శ్రీనివాసరావు, గంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు పెదశింగు లక్ష్మణరావు శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మాజీ శాసనసభ్యులు పెదశింగు లక్ష్మణరావు శత జయంతి ఉత్సవాలు సోమవారం జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం లో మొట్టమొదటిసారిగా అగ్నికుల క్షత్రియుల నుండి 1962 నుండి వరుసగా 17 సంవత్సరాలు మచిలీపట్నం శాసనసభ్యుడిగా ఆంధ్ర రాష్ట్ర శాసనసభ కు ఎన్నుకోబడ్డారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక పదవులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్వహించారన్నారు. నేషనల్ ఫిషర్ మేన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, నేషనల్ సాల్ట్ బోర్డ్ సభ్యులు,మైనర్ పోర్ట్ డెవలప్మెంట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ సంఘం అద్యక్షులు, రాష్ట్ర బి సి శాసన సభ కమిటీ సభ్యులు గా మత్స్య పరిశ్రమ కు ఎనలేని సేవలు చేశారని తెలిపారు. సోమవారంతో ఆయనకు వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక కోనేరు సెంటర్ లో సాయంత్రం బహిరంగ సభ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు ఈ కార్యక్రమానికి రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలనుండి రాజకీయాల కతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో బలగం విజయ శేఖర్, నడకుడి టి అర్జున, సైకం భాస్కరరావు,పి అమర్,పి వి ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-చల్లపల్లి

ప్రజా కళాకారులు, ప్రజా నాట్యమండలి(సీపీఐ) నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు అడ్డాడ దుర్గా నాగేశ్వరరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై మండల పరిధిలోని వక్కలగడ్డలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఉన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, సీపీఐ నేతలు రావి బాబూరావు, మల్లుపెద్ది బోసు, పాలడుగు రత్నబాబులు భౌతిక కాయంపై ప్రజానాట్య మండలి, సీపీఐ జెండాలను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. మల్లుపెద్ది లెనిన్, అల్లూరి బాబూరావు, పూసపాటి బ్రహ్మానందరావు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేసనకుర్తి శరత్ బాబు, కావూరి పరమేశ్వరరావు, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు తదితరులు నివాళు లర్పించిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-పెదపారుపూడి

సోమవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమై, 20వ తేదీ వరకు జరుగుతాయని పెదపారుపూడి గ్రంథాలయ అధికారిణి ఎం వి ఎస్ లక్ష్మి ఎలమర్రు గ్రంథాలయ అధికారిని జె విజయలక్ష్మి, వెంట్రప్రగడ గ్రంథాలయ అధికారి కె.నాగరాజు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బాలల దినోత్సవం రోజున స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరి కిషోర్ చేతుల మీదుగా ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు. **ఉంగుటూరు :** ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఉంగుటూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారి స్వర్ణలతా దేవి తెలిపారు. దాతల సహకారంతో వారం రోజులపాటు విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.రఘు

ఆదర్శప్రాయుడు ద్రోణాదుల సుబ్బారావు

సంతాప సభలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు

ప్రజాశక్తి-పెదపారుపూడి

ద్రోణాదుల సుబ్బారావు యువతకి ఆదర్శనీయమని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు అన్నారు. గుడివాడ రాజేంద్రనగర్‌లోని స్కంద అపార్ట్మెంట్ ప్రాంగణంలో సిపిఎం నాయకులు, మాజీ కౌన్సిలర్ కీర్తిశేషులు ద్రోణాదుల సుబ్బారావు సంతాప సభను నిర్వహించారు. సంతాప సభలో ఆర్‌సిపిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ద్రోణాదుల సుబ్బారావు స్థూపం నిర్మాణానికి కృషిచేయాలని కోరారు. రైతులు, కౌలు రైతులు, కార్మికులు సంఘాల తరఫున ఆయన పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన లేని లోటు సిపిఎంకు తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎం, వైసిపి, టిడిపి నాయకులు పాల్గొని సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిబద్ధతగల రాజకీయాలు చేస్తూ, అనేక పోరాటాలు చేసిన సుబ్బారావు ఆదర్శప్రాయుడని రాజకీయ పార్టీల నాయకులు కొనియాడారు. సుబ్బారావు సంతాప సభలో సిపిఎం నాయకులు ఆర్ సి పి రెడ్డి, మురాల రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సమరం, వైసిపి నాయకులు పాలేటి చంటి, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, మాదాసు వెంకటలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ గుదె లక్ష్మి రంగనాయకమ్మ, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, ఓ గంగాధర్ ప్రసాద్ విల్సన్, పిడుగు దేవ సహాయం, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కుష్టు రోగుల అభ్యున్నతికి కృషి : రాధిక

ప్రజాశక్తి-గన్నవరం

తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల్లో కుష్టు రోగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని లెప్రా సొసైటీ తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల కో-ఆర్డినేటర్ మామిడి



దుస్తులు పంపిణీచేస్తున్న మామిడి రాధిక

రాధిక తెలిపారు. విజయవాడ పూర్ణ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన కీర్తిశేషులు జి.ఆనంద లక్ష్మి కుమారి జయంతి సందర్భంగా డాక్టర్ నీరజ సౌజన్యంతో డాక్టర్ అనన్య చేతుల మీదుగా కుష్టు రోగులకు దోమతెరలు, చెప్పులు ఆదివారం పంపిణీ చేశారు. కుష్టు రోగి కనతరపు సరస్వతికి రూ.16 వేలు విలువైన ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 48 లెప్రసీ కాలనీలో కుష్టు రోగులకు ప్రత్యేక పాదరక్షలు అందిస్తున్నామన్నారు. స్వయం సహాయక కిట్లు, ఇతర ఉపకరణాలు ఇస్తున్నామని చెప్పారు. ఎంతోమంది దాతలు, స్వచ్ఛంద సంస్థల పరస్పర సహకారంతో కుష్టు రోగులకు చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నిర్భయ క్రాంతి మహిళ మండలి ప్రెసిడెంట్ ఎ.రత్నలక్ష్మి, సెక్రటరీ పి.సత్యవతి, కౌన్సిలర్ నాగరాజు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జి.వెంకటరాజు, లెప్రసీ కాలనీ మాజీ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



హంసలదీవి బీచ్‌కు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-కోడూరు

కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకొని హంసలదీవి పాలకాయతిప్ప సముద్రతీరం వద్దకు శని, ఆదివారం పెద్ద ఎత్తున యాత్రీకులతో సముద్ర తీరం కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన హంసలదీవి సాగర తీరం వద్దకు అధిక సంఖ్యలో భక్తులు దూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాలతో విచ్చేశారు. మహిళా భక్తులు సాగర తీరం వద్ద దేవుళ్ళ చిత్రపటాలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణా సంగమ ప్రదేశం వద్దకు అధికారుల అనుమతించకపోవడంతో యాత్రికులు తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. కార్తీక మాసంలో పవిత్ర కృష్ణవేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తే మంచిదని ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రత్యేక వాహనాలతో హంసలదీవి వచ్చామని తెలిపారు. స్థానిక అధికారులు మాత్రం తమను అనుమతించడం లేదని కేవలం సముద్ర స్నానాలకైతే ఇక్కడ వరకు రావాల్సిన అవసరం లేదని యాత్రికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పునరాలోచన చేసి పవిత్ర సంగమం వద్దకు యాత్రికులను అనుమతించాలని కోరుతున్నారు. పాలకాయతిప్ప మెరైన్, కోడూరు పోలీసులు, అటవీశాఖ అధికారులు హంసలదీవి సాగర తీరాన గస్తీ నిర్వహిస్తూ బీచ్‌లో స్నానాలు చేసే వారికి తగు జాగ్రత్తలు సలహాలు, సూచనలు అందించారు.

ప్రభుత్వాస్పత్రిలో ముగిసిన రెడ్ వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో రెడ్ వాలంటీర్ల బృందం చేపట్టిన శ్రమదాన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నాలుగు ఆదివారాలుగా రెడ్ వాలంటీర్లు ఆసుపత్రి ఆవరణలో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసే పనిని ఉధృతంగా చేపట్టారు. ముళ్ల పొదలు దట్టంగా పెరగటంతో పాముల




శ్రమదానంలో వాలంటీర్లు

సంచారం అధికంగా ఉందని, రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు రెడ్ వాలంటీర్లు దృష్టికి తెచ్చారు. దీంతో 15 మంది రెడ్ వాలంటీర్లు ఉచితంగా శ్రమదానం చేసి ఆసుపత్రి ఆవరణ మొత్తాన్ని శుభ్రం చేసి సమస్యను పరిష్కరించారు. ప్రజలకు ఇబ్బంది కల్గించే ఏ సమస్య ఉన్నా దాని పరిష్కారానికి రెడ్ వాలంటీర్లు ముందు ఉంటారని వాలంటీర్ల కన్వీనర్ మోటమర్రి నాగ బ్రహ్మాచారి తెలిపారు. గన్నవరం మండలంలో ఏ గ్రామంలో సామాజిక సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు. పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో ఏర్పాటైన రెడ్‌వాలంటీర్ల కమిటీ చేస్తున్న సామాజిక సేవలు ఎంతో మందికి ఆదర్శమని మన్నే సుందరరావు అన్నారు. వాలంటీర్లు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి ఆంజనేయులు, బడుగు మరియదాసు, బి.దుర్గారావు, బౌతుల నాగరాజు, మిరప నాగేశ్వరరావు, పిల్లి మహేష్, చిటికెల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు ఎస్ఐగా రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-కోడూరు

అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వి.రాజేంద్రప్రసాద్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. కోడూరు స్టేషన్ సిబ్బంది రాజేంద్రప్రసాద్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తానని అసాంఘిక



శక్తుల కార్యకలాపాలను అదుపు చేయడానికి శ్రయు శక్తుల ప్రయత్నిస్తానని మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాలమ్మ దేవస్థానం పాలక మండలికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆదివారం తెలిపారు. ఉప కమిషనర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ వారు మేరకు కొండాలమ్మ దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా పనిచేయటానికి ఆసక్తి గలవారు డిసెంబర్ మూడోతేదీలోగా ఉప కమిషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, రామారావు పేట, కాకినాడ చిరునామాకు దరఖాస్తులు పంపించాలని కోరారు.



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పోతిన వెంకట మహేష్

జగనన్న ఇళ్ల లేఅవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-భవానీపురం : జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీళ్లు రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వాసులకు కేటాయించిన వెలగలేరు, మునగపాడు లేఅవుట్‌లను మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల గాంధీతో కలిసి జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 240 ఎకరాల మునగపాడు లేఅవుట్ విజయవాడ నగరవాసులకు కేటాయించారని, ఈ లేఅవుట్ విజయవాడ నగరానికి 45 కిలోమీటర్ల దూరాన కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, మధ్య ఉన్న బీడు భూమి కేటాయించారని తెలిపారు. రాబోయే 100 ఏళ్ళు కూడా ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టడం అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రెడ్డిపల్లి గంగాధర్, రాము గుప్తా, షేక్ అమీర్ భాష, వేంపల్లి గౌరీ శంకర్,జల్లి రమేష్, పొట్నూరి శ్రీనివాసరావు , కూరగంజి వెంకటరమణఏలూరి సాయి శరత్, బోమ్మ రాంబాబు, ప్రతినిధి స్టాలిన్ శంకర్, వెన్న శివశంకర్, మొబీనా, గన్ను శంకర్, బోట్ట సాయి పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ లోని జిల్లా పరిషత్ పాఠశాల నందు 1977-78 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా విద్యా బుద్ధులు నేర్పిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు తమగత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 47 సంవత్సరాల తరువాత కలుసుకున్న ఆనందానుభూతిని పూర్వ విద్యార్థులందరూ పంచుకున్నారు. అనంతరం శ్రీ కర కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో, పూర్వ విద్యార్థులను ఉద్దేశించి పలు ఆసక్తికర విషయాలను విశ్రాంత ఉపాధ్యాయులు వెల్లడించారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ప్రజాశక్తి-వత్సవాయి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జడ్పిటిసి యేసుపోగు దేవమణ, గ్రామ సర్పంచి భూక్య సీతమ్మ అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయి గ్రామంలో సిఎస్ఐ చర్చి దగ్గర కల్వర్టు శిధిలావస్థకు చేరి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుం డడంతో కల్వర్టును బాగు చేయించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముక్తేశ్వర రావు, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షుడు గాదెల రామారావు, రిటైర్డ్ బ్యాంక్ ఏజీఎం కుక్కల సుదర్శనం, వార్డ్ నెంబర్లు పాపగంటి సుజాత వెంకటేశ్వర్లు, రాయల శ్రీను, మోదుగు ప్రసన్న పాల్గొన్నారు.

వ్యాయామం, ఆహారపు అలవాట్లతో

మధుమేహం నియంత్రణ

- ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ రాకేష్ బొబ్బా
- నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మధుమేహం నేడు వేగంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధుల్లో ఒకటి. ప్రతిరోజూ వ్యాయామం, చక్కటి ఆహారపు అలవాట్లతో మధుమేహం రాకుండా జాగ్రత్తపడవచ్చని రమేష్ హాస్పటల్స్ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ రాకేష్ బొబ్బా తెలియచేశారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా అవగాహన కోసం ఆయన మాటల్లోనే.... ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదీన ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకుంటారు. 1922లో చార్లెస్ బెస్ట్‌తో కలసి ఇన్సులిన్‌ను కనుగొన్న సర్ ఫ్రెడ్రిక్ బ్యాంటింగ్ పుట్టినరోజు సందర్భంగా నవంబరు 14న మధుమేహ దినోత్సవంగా ప్రకటిం చారు. ఈరోజు ప్రదాన ఉద్దేశం సాదారణ ప్రజలలో మధుమేహం గురించి, దాని వలన కలిగే సమస్యల గురించి అవగాహన కల్పించడం. ఇందులో భాగంగా ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ సంస్థ ప్రతి ఏటా ఒక కొత్త థీమ్‌నువిడుదల చేస్తుంది. ఈఏడాది థీమ్‌ను పరిశీలిస్తే 'ఎడ్యుకేట్ టు ప్రొటెక్ట్ టుమారో' గా ప్రకటించారు. మధుమేహం (షుగరు వ్యాధి) ఒక హార్మోన్ సమస్య. ఇన్సులిన్ అనే హార్మోను క్లోమ గ్రంధి నుండి ఉత్పత్తి చేయబడుతుంది. ఈ ఇన్సులిన్ తగినంత ఉత్పత్తి అవ్వనపుడు లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయనపుడు రక్తంలో ఉండే గ్లూకోజ్ మన శరీరకణాల్లోకి ప్రవేశించలేదు. దాని ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఉండవలసినదానికన్నా ఎక్కువగా ఉంటాయి. దీనిని మధుమేహం అంటారు.

మన దేశంలోనే ఎక్కువ....

ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశం మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్యలో చైనా తరువాత 77 మిలియన్ల మందితో రెండవ స్థానంలో ఉంది. రానున్న 15 సంవత్సరాలలో ఈసంఖ్య 140 మిలియన్లకు చేరే అవకాశం ఉంది. బాధాకరమైన విషయం ఏమిటంటే మన దేశంలో ఉన్న మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 70 శాతం మందికి మధుమేహం నియంత్రణలో ఉండదు. దీని కారణంగా వీరు దీర్ఘకాలిక సమస్యలు అయినటువంటి హార్ట్ ఎటాక్, కిడ్నీ సమస్యలు, కంటి సమస్యలు, నరాల సమస్యలు వంటి వ్యాధుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. దీనికి గల ముఖ్య కారణం వీరిలో మధుమేహం గురించి అలాగే దాని వలన వచ్చే దీర్ఘకాలిక సమస్యల గురించి సరైన అవగాహన లేకపోవడమే. ఈరోజు యొక్క ముఖ్య ఉద్దేశం ఇలాంటి ప్రజలలో అవగాహన కల్పించి వారిని దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా కాపాడమే.



వ్యాయామం అవసరం...

శారీరక వ్యాయామం లేకపోవడం, కుటుంబ మధుమేహ చరిత్ర, ఊబకాయం, నిశ్చలజీవన శైలి, పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ వినియోగం, పొగాకు వా డటం వంటివి మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగానికి దోహదపడుతున్నాయి. సాదారణంగా మధుమేహం ఉన్న వారిలో ఎక్కువగా దాహం వేయడం, ఎక్కువసార్లు టాయిలెట్‌కు వెళ్లడం, చూపు మందగించడం, పుండ్లు త్వరగా మానకపోవడం, ఆకస్మాత్తుగా బరువు తగ్గడం, తరచుగా వ్యాధుల బారిన పడటం వంటి లక్షణాలు ఎక్కువగా చూస్తు ఉంటాము. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవచ్చును. తద్వారా మధుమేహం వలన వచ్చే దీర్ఘకాలిక సమస్యల నుండి కాపాడుకోవచ్చును. ఈఆరోగ్యకరమైన జీవనశాలలోల భాగంగా మంచతి ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా చూసుకోవడం వంటివి పాటించాల్సి ఉంటుంది.

పిల్లలకు అవగాహన కల్పించాలి...

ముఖ్యంగా పిల్లల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. శారీరక వ్యాయామం విలన కలిగే లాభాల గురించి తెలియచేయాలి. ఫాస్ట్‌ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్, హై కాలరీ ఫుడ్స్, తినడం వల్ల వచ్చే మధుమేహ, ఊబకాయం వంటి వ్యాధుల గురించి వివరించాంలి,. నిశ్చల జీవనశైలి వలన కలిగే నష్టాల గురించి వివరించాలి. తాజా పండ్లు, కూరగాయలు వంటివి వారి రోజువారి ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలి.

నియంత్రణే తప్ప పూర్తిగా నయంచేయలేము

సాంప్రదాయ పరిజ్ఞానం ప్రకారం మధుమేహాన్ని నియంత్రణలో ఉంచవచ్చును. కానీ పూర్తిగా నయం చేయలేము. కానీ ప్రస్తుతం ఉన్న పరిశోధనల ప్రకారం కొంతమందిలో మధుమేహాన్ని తిరోగమనం చేయవచ్చును డయాబెటిస్ రివర్సల్ అనేది ' ఎబిసిడిఇ ' రూల్ మీద ఆధారపడి ఉంటుంది.

- ' ఎ ' (ఏజ్ ఆఫ్ ది పేషంట్) – తక్కువ వయసు ఉన్న వారిలో డయాబెటిస్ రివర్సల్‌కు ఎక్కువగా అవకాశం ఉంటుంది.
- ' బి ' (బాడీ వెయిట్) – అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న వారు శరీర బరువును తగ్గించుకోవడం ద్వారా డయాబెటిస్ రివర్సల్ సాధ్యమవుతుంది.
- ' సి ' – (పెప్టైడ్ లెవన్స్) – పెప్టైడ్ లెవన్స్ ఎక్కువగా ఉన్న వారిలో డయాబెటిస్ రివర్సల్‌కు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- ' డి ' – (డ్యూరేషన్ ఆఫ్ డయాబెటిస్) – ఎవరిలో అయితే మధుమేహం కొత్తగా కనుగొనబడుతుందో లేదా షుగర్ వ్యాధి వచ్చి తక్కువ కాలం అవుతుందో వారిలో డయాబెటిస్ రివర్సల్‌కి ఎక్కువ అవకాశం ఉంటుంది.
- ' ఇ ' – (ఎంతూషియాజమ్ ఆఫ్ ది పేషంట్) – ఎవరైతే మధుమేహ నివారణకు ఎక్కువగా కృషి చేస్తారో నిపుణులు చెప్పినట్లు పాటిస్తారో మధుమేహాన్ని రివర్స్ చేయవచ్చును.

బరువుతగ్గడం, డయాబెటిస్ నిర్ధారించబడి తక్కువ కాలం అవడం, శారీరక వ్యాయామం చేయడం, అదేవిధంగా కొంతమంది అధిక బరువు ఉన్న వారు బేరియాట్రిక్ సర్జరీ చేయించుకోవడం వంటి అంశాలు డయాబెటిస్ రివర్సల్‌కు దోహదపడతాయి.

మొక్కల పెంపకంతో కాలుష్యం నివారణ



మొక్కలు నాటుతున్న నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా కృష్ణలంక 22వ డివిజన్ అన్నమ్మతల్లి గుడి ఏరియాలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శి వర్గసభ్యులు బత్తుల చిన్నారావు మాట్లాడుతూ... కాలుష్య నివారణకు ప్రతి ఇంటి వద్ద తప్పని సరిగా మొక్కలు నాటాలని, అలాగే నగర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు ప్రోత్సహిం చాలని అన్నారు. నగరంలో రోజు రోజుకు వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని అన్నారు. దీని నివారణకు పచ్చని చెట్లను పెంచాలని కోరారు. కాలుష్య నివారణలో విఎంసి, సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. అయితే వాతావరణ కాలుష్య నివారణకు సిపిఎం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిం దన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వాజా శ్రీనివాసరావు, కాయల లక్ష్మణ, విజ్జి సన్యాసిరావు, తాతాసాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి నార్కో పరీక్షలు చేయించాలి : టిడిపి



మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

ప్రజాశక్తి-వన్‌టౌన్ : రాష్ట్రంలో అవినీతి అనకొండలా పెరిగిందని, లిక్కర్ స్కాంలో విజయసాయి రెడ్డి అల్లుడు అన్నను అరెస్టు చేశారని, దీనికి సూత్రధారి విజయసాయి రెడ్డి కాబట్టి, ఆయన్ను కూడా అరెస్టు చేసి, నార్కో టెస్ట్ పరీక్షలు చేయిస్తే విషయం బయటపడుతుందని కేంద్ర ప్రభుత్వ అధికారులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న కోరారు. ఆదివారం వన్‌టౌన్‌లోని బుద్ధా వెంకన్న నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుద్ధా వెంకన్న మాట్లాడుతూ సిఎం కొడుకుగా, ఆడిటర్‌గా ఉన్న జగన్, విజయ సాయి రెడ్డిలు రూ. 40 వేల కోట్లు దోచుకున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వంలో ఉండి రెట్టింపు స్థాయిలో ప్రజా ధనాన్ని దోచేశారన్నారు. కేంద్రం జోక్యం చేసుకుని విజయసాయి రెడ్డికి నార్కో పరీక్ష చేయించాలని కోరారు. అతని అవినీతిపై ఈడీ కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు

కెనరా రోబెకో మిడ్‌క్యాప్ ఫండ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ మేనేజ్ మెంట్ కంపెనీలలో ఒకటైన కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్‌ను ప్రారంభించినట్లు సంస్థ సీఈవో రజనీష్ ఎన్. ఒక ప్రకటనలో తెలిపారు. పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండ్ ఈక్విటీ స్కీమ్ అయిన కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్‌ను తీసుకువచ్చినట్లు తెలియచేశారు. కొత్త ఫండ్ ఈనెల 11వ తేదీన తెరవబడి, 25వ తేదీతో ముగుస్తుందన్నారు. దీర్ఘకాల సంపదను సృష్టించడంతో పాటు ఆకర్షణీ యమైన పథకాలను అందిస్తుందని తెలియచేశారు. వివరాలకు కెనరా రోబెకో సంస్థ నందు సంప్రదించాలని కోరారు.

నేడు 'స్పందన' : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ అన్నారు.

నేడు విఎంసిలో స్పందన : కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.నగరపాలక సంస్థ కార్యాలయముతో పాటుగా మూడు సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను సమర్పించ వచ్చునని అన్నారు.

పేదలకు గృహ వసతి కల్పనే లక్ష్యం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వటమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎవ్వరూ చేయలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 35.25 లక్షల ఇంటి స్థలాలు మంజూరు చేసి చరిత్ర సృష్టించారన్నారు. 25.25 లక్షల మందికి ఇళ్ల పట్టాలు కూడా అందజేయగా గృహ నిర్మాణాలు కూడా జరుగుతున్నాయన్నారు. జనసేన టిడిపి నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.79.32 కోట్లతో కూడిన నివేశనా స్థలాలు అందజేయగా ఇందుకోసం 8724 గృహాలు మంజూరు కాగా ఇందుకోసం రూ.1300 కోట్లతో మెరక పనులు చేయిస్తున్నామన్నారు. దశలవారీగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జగనన్న కాలనీలో లేవట్లలో మెరుగైన వస్తువులు కల్పించడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ల పాటు కరోనాతో కొంత ఆర్థిక ఇబ్బందుల వల్ల మౌలిక వసతుల కల్పనలో ఆలస్యం జరిగిందన్నారు. త్వరలోనే ఈ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. తాము ఎక్కడా పార్టీలు, మతాలు, కులాలు గానీ చూడకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేశామని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం లంకమ్మ మాన్యంలో ఇళ్ల స్థలాలు ఇచ్చి 20 సంవత్సరాలు అయినా రోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు పడుతుంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులు నిర్మించామన్నారు. గత టిడిపి ప్రభుత్వం మాదిరిగా కాకుండా రహదారులు, విద్యుత్, డ్రెయినేజీ, మంచినీటి సదుపాయాలు కల్పించిన తర్వాతే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. దీనిపై టిడిపి, జనసేన రాద్ధాంతం చేయడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సమితీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ చింతలపూడి బాలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వమే చేపట్టాలి : జనసేన

మచిలీపట్నం రూరల్ : ఇళ్ళు పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ పాతూరులో పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలను జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిరుపయోగమైన భూమిని పేదలకు పంచి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. చిన్నాపురం జనసేన నాయకులు జన్నునాగరాజు,చంటి,గురువయ్య,పోతరాజు, అడుసుమిల్లి ,శ్రీనివాస్, బొమ్మ సాని,నరేష్, వంపుగడవల చౌదరి,గడ్డం రాజు,కర్రీ మహేష్, చింతలగుంట కొండ, భీరం సుదర్శన్, గుణ్ణం వాసు, తోట భాస్కర్,ఈమని బాబు, తోట రాజేష్, గుణ్ణం సోమేశ్, గంపల కష్ణ, విన్నకోట శ్రీకాంత్,మైఖేల్, వేములచక్రి, నరసింహ, మణికంఠ, మండల,పట్టణ పార్టీ, చిన్నాపురం నాయకులు పాల్గొన్నారు.



మౌలిక వసతులు కల్పించాలి

కోడూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నామని చెప్పుకునే జగనన్న ఇళ్ళు పేదలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయని నవరత్నాలలో ఒక రత్నం రాలిపోయిందని కోడూరు మండల జనసేన నేతలు అన్నారు. ఆదివారం కోడూరు లోని నరసింహపురం రోడ్డు నందు సాయిబాబా గుడి సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్ లో కోడూరు మండల జనసేన నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేఔట్లలోకి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందన్నారు. మౌలిక సదుపాయాలైన రహదారులు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయం కల్పించకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరిరావు, బడే వెంకటేశ్వరావు, మేడా పిచ్చయ్య, జరుగు నారాయణ, బడే ఆకురాయ్, బండే గోపాలకష్ణ, సజ్జా మల్లికార్జునరావు, యలవర్తి చంటి, కూనపరెడ్డి లక్ష్మణ, సిరి శెట్టి హనుమాన్, కవతం రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీరు లాగా ఉందని ఉమ్మడి కష్ణా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డిరామకృష్ణ అన్నారు. జగనన్న ఇల్లు పేదలందరి కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా కోడూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు స్థానిక నరసింహాపురం రోడ్ లోని గల జగనన్న లేఔట్లను మండల పార్టీ, జిల్లా నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డిరామకృష్ణ పరిశీలించారు. మర్రే గంగయ్య జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, పిట్టలంక గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్ రావు, ఉమ్మడి కష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోట సోమశేఖరరావు , రెడ్రోతు కష్ణబాబు, జరుగు ఆదినారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు కోట ప్రసాద్, కార్యదర్శులు పెద్ది వెంకట్ ,రేపల్లె మహేష్ పాల్గొన్నారు.



దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్ఎ

చల్లపల్లి : దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేదవిద్యార్థులకు లాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఐవీఎం హోంలో జరిగింది. ముఖ్య అతిథిగా సింహాద్రి రమేష్ బాబు మాట్లాడారు. ఐ వి ఎం స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఎందరో పేదలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారని ప్రశంసించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సహకారంగా స్కాలర్‌షిప్‌లను, సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు లాప్‌టాప్‌లను అందించి తోడ్పాటునివ్వడం అభినందనీయమన్నారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఎల్‌కెజి నుండి పీజీ వరకు చదువుతున్న పేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా రూ. 20 లక్షలు స్కాలర్‌షిప్‌లు, రూ 3 లక్షల విలువ చేసే లాప్‌టాప్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు రూ.3 లక్షల విలువచేసే లాప్‌టాప్‌లు, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదివే 15 మంది విద్యార్థులకు రూ. 4 లక్షలు స్కాలర్‌షిప్‌లు, ఎల్‌కెజి నుంచి పదవ తరగతి వరకు వివిధ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే 120 మంది విద్యార్థులకు గాను రూ. 13 లక్షలు ఫీజులుగా చెల్లించామన్నారు. దివి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, సజ్జా బలరామ్, పరుచూరి వెంకటేశ్వరరావు, ఐ వి ఎం డైరెక్టర్ వేములపల్లి రోజా తదితరులు పాల్గొన్నారు.



లేఅవుట్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలి

అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలో కరకట్టకు దిగువన ఎడ్ల లంక వెళ్లే మార్గంలో వేసిన 21.39 ఎకరాల పెద్ద లేఅవుట్‌లో 807 మందికి స్థలాలు కేటాయించినందున, వరద ముంపునకు గురికాకుండా దాని చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. 'జగనన్న కాలనీలు పేదలందరికీ కన్నీళ్లు అనే పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు అవనిగడ్డ మండల పరిధిలోని వేకనూరు, తుంగలవారిపాలెం లేఅవుట్లతోపాటు అవనిగడ్డ కరకట్ట కింద లేఅవుట్లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు విలేకరులతో మాట్లాడారు. వేకనూరు, తుంగలవారిపాలెం గ్రామాల్లో 2.20 ఎకరాల లేఔట్ లో 90 మంది లబ్ధిదారులకు నివేషన స్థలాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటివరకు గృహం నిర్మించుకోవడానికి ఒకరు కూడా ముందుకు రావడం ప్రభుత్వ పనితీరునకు నిదర్శనమన్నారు. ,కరకట్ట దిగోన ఎడ్ల లంక రహదారిలో ఏర్పాటు చేసిన లేఔట్ లో 87 మందికి స్థలాలు కేటాయించగా ఆ ప్రాంతం వరద ముంపునకు గురవుతోందని పేర్కొన్నారు. అందువల్ల లేఔట్ చుట్టూ రక్షణ కూడా నిర్మిస్తామని కలెక్టర్ అనుమతితో ఆరడుగుల మేర మేరకు తోలించి గృహాలు నిర్మించడానికి సిద్ధం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవటం లేదన్నారు.అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, సీనియర్ నాయకులు చిన్నగిరి సత్యనారాయణ, రాజనాల వీరబాబు, తుంగల రాజా, తుంగల వేణు బాల భాస్కర్, బచ్చు ప్రశాంత్, శ్రీహరి, గౌస్ కాటమ భోగిరెడ్డి నాగేశ్వరరావు, ఎ.గోపాలకృష్ణ, భోగిరెడ్డి బాలాజీ, గంగు బాలాజీ పాల్గొన్నారు.



గాంధీ క్షేత్రంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

సోమవారంనాడు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గాంధీ క్షేత్ర కమిటీ, దివిసీమ లలిత కళా సమితి, దివిసీమ బాలానందన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. బీఈడీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మొదటి రోజులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన. వకృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి 82 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం అవనిగడ్డ గాంధీ క్షేత్రం ఆవరణలో పాటలు, పద్యాల పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కోనపరెడ్డి చంద్రశేఖర్, తుంగలపాడు రంగారావు, పి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సంస్థ అధ్యక్షులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు



గ్రంథాలయ వారోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ

గ్రంథాలయ వారోత్సవ వాల్ పోస్టర్లను శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆవిష్కరించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ఈ పోస్టర్లను ఆవిష్కరించగా ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరగనున్నట్లు అవనిగడ్డ గ్రంథాల అధికారి జే ప్రభుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వారోత్సవాలను విద్యార్థులు పాఠకులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సమితి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ చింతలపూడి బాలు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు

78 మందికి ఉచిత వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ క్లబ్ సేవావనంలో ఆదివారం ఉచిత మధుమేహం వ్యాధి చికిత్సలు నిర్వహించి ఉచితగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ రజిని 78 మంది మధుమేహ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు అందజేసి వారికి తగు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సిహెచ్ రాజా, జి రామకష్ణ, ఎస్ పరంధామయ్య, ఎం సుధాకర్, పి చిట్టిబాబు, ఫణి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధనలు

మోపిదేవి : మండల పరిధిలోని కోసూరు వారి పాలెం గ్రామంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వెలుపల కృష్ణా నది ఒడ్డున ఉన్న మామిడి తోటల్లో వన సమారాధన నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఉదయం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి వన సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తుంగల రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో రెండు వేల మంది భక్తులకు పైగా వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని భోజనాలు చేశారు. **చల్లపల్లి :** గూడూరు మండలం మల్లవోలు గ్రామంలోని శ్రీ చిన మహేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కార్తీక వన సమారాధన జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్ :** స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆదివారం యాదవ సోదరుల కార్తీక మాస వనభోజనాలు జరిగాయి. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థ సారథి, పామర్రు ఎమ్మెల్యే అనిల్ కుమార్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ అధ్యక్షులు వల్లభనేని బాలశౌరి, ఎం ఎల్‌సి బచ్చుల అర్జునుడు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నంలోని పోతేపల్లి జ్యూయలరీ పార్కులో రోల్డ్ గోల్డ్ ఇమిటేషన్ జ్యుయలరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనసమారాధన జరిగింది.

జగనన్న కాలనీల్లో జనసేన పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : వైసిపి ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న జగనన్న కాలనీల్లో వసతులు శూన్యమని జనసేన నాయకులు బొలిశెట్టి వంశీకృష్ణ అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు విజయవాడ రూరల్ మండలం నున్న మండలం తలతిప్ప గ్రామంలో విజయవాడ వాసులకు ఇచ్చిన జగనన్న ఇళ్ల కాలనీలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగర వాసులకు 20 కిలోమీటర్ల దూరంలో కొండలు గుట్టల మధ్య స్థలాలిచ్చారని విమర్శించారు. 128 ఎకరాల్లో సెంటు భూమి పథకం కింద పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు లేవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగేష్, కేంబురి కష్ణ భవాని, ఏపుగంటి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

రూట నూతన అధ్యక్షునిగా బాషా ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర నూతన అధ్యక్షులుగా విజయవాడ 59వ డివిజన్‌లోని ఎంకె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు లయన్ ఇమామ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కడప మద్రాస్ రోడ్‌లోని షాహీ దర్బార్ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ అబ్దుల్ వారిస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.బి.అంజద్ బాషాను కలిశారు.



హక్కుల కోసం శ్రామిక మహిళలు ఐక్యం కావాలి

శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు శ్రామిక మహిళల హక్కులను కాలరాసేవిగా ఉన్నాయని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి విమర్శించారు. హక్కుల కోసం శ్రామిక మహిళలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక మహిళ ఎన్టీఆర్ జిల్లా సదస్సు విజయవాడ రాణిగారితోటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ధనలక్ష్మి మాట్లాడుతూ నేటికీ అత్యధిక శాతం మహిళలు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో చాలామంది మహిళలకు కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, మంచినీరు సౌకర్యాల్లేక అనేక ఇబ్బరుబు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనేక రంగాల్లో మహిళా కార్మికుల సంఖ్య పెరిగిందని, పురుషులతో సమానంగా పనిచేస్తున్నా వేతన వ్యత్యాసం ఉందని అన్నారు. కార్మిక చట్టాల అమలులో కూడా మహిళలు వివక్షకు గురవుతున్నారని తెలిపారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల మాట్లాడుతూ డిసెంబర్ 15,16 తేదీల్లో విజయవాడలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా మహాసభ సందర్భంగా జరిగే ర్యాలీలో శ్రామిక మహిళలంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఎ, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి చట్టబద్ధ సౌకర్యాలు మాత్రమే కాకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో శ్రామిక మహిళలు భాగస్వాములు కావాలన్నారు. ముందుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు టి. తిరుపతమ్మ సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న ధనలక్ష్మి

జర్నలిస్టులకు ఉచితంగా గుండె వైద్య పరీక్షా శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జే శాప్), రోటరీ క్లబ్ ఆఫ్ ఇండియా, యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు గుండె వైద్య పరీక్షా శిబిరం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ పూర్వపు సబ్‌కలెక్టర్ సిహెచ్.భానుప్రసాద్ కుమారుడు కిరణ్ తేజ పిన్న వయస్సులోనే గుండెపోటుతో ఆకస్మికంగా మతి చెందారు. ఇలాంటి విషాదకర సంఘటన మరో కుటుంబంలో జరగకూడదన్న లక్ష్యంతో భానుప్రసాద్ 'యంగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ చదలవాడ కిరణ్ తేజ మెమోరియల్ ట్రస్ట్' (కెటిసి) ఏర్పాటు చేసి యువతకు గుండె జబ్బులపై అవగాహన కలిగిస్తున్నారు. ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా సిద్ధార్థ వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వర్ మాట్లాడారు. డాక్టర్ ఎంసి.దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు కాజ, రమేష్ ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హెచ్.ఎస్.సోమనాథ్, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జే శాప్ అధ్యక్షుడు తాడేపల్లి రత్నాకర్, టైమ్స్ ఆఫ్ ఇండియా న్యూ ఎడిటర్ ధారా గోపి, జే శాప్ ఉపాధ్యక్షుడు డి.రవికాంత్, ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్ కోశాధికారి డాక్టర్ జంధ్యాల శాస్త్రి, రమేష్ పాల్గొన్నారు. రమేష్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ మమత తదితరులు వైద్య సలహాలు అందించారు.

నేడు పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన జరుగుతుంది. నగరంలోని సివిల్ కోర్టుల సమీపంలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆవరణ గల వేమూరి అనిల్ కుమార్ సాహిత్య వేదికపై సొసైటీ ఉపాధ్యక్షులు జి.లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ పుస్తక ప్రదర్శనను ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ ప్రారంభిస్తారు.

మొదటి పేజీ తరువాయి

తనిఖీల ద్వారా కల్తీలకు అడ్డుకట్ట

సూచనలు వచ్చాయి.

ప్రశ్న : ఫుడ్ కంట్రోల్ విభాగంలో సిబ్బంది కొరత పరిస్థితి ఏమిటి ?

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫుడ్ సేఫ్టీ యాక్ట్-2011 ప్రకారం ఆహార పదార్థాల కల్తీ నిరోధక శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ లాంటి స్థానిక సంస్థలకు వీటిపై ఎటువంటి అధికారులు ఉండవు. అయితే ప్రత్యేక శాఖలోని వివిధ క్యాడర్లలోని పలు పోస్టులను ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. అటు నగరపాలక సంస్థకు అధికారం లేకపోవడం, ఇటు ఆహార కల్తీ నిరోధకశాఖలో పోస్టులు భర్తీ కాకపోవడంతో కొందరు వ్యాపారులు కల్తీలకు పాల్పడుతున్నారు. ఆహార పదార్థాల దగ్గర నుంచి పాలు, వెన్న, నూనెలు, చివరకు చంటి పిల్లలకు వాడే పాలపిండి సైతం కల్తీలమయం అవుతోంది. అయితే తనిఖీల ద్వారా కొంత వరకు కల్తీలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నాము. ఇటీవల నమోదైన కేసుల వివరాలే తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో 135 కేసులు, కృష్ణాజిల్లాలో 50 కేసులు, జాయింట్ కలెక్టర్ (జెసి) వద్ద 180 వివిధ రకాల కేసులు నమోదై ఉన్నాయి.

ప్రశ్న : ఎంత మంది జనాభాకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి ?

ఫుడ్‌సేఫ్టీ యాక్ట్ ప్రకారం నగరం లేదా పట్టణ ప్రాంతంలో 50 వేల జనాభాకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, రూరల్ ప్రాంతంలో లక్ష జనాభాకు ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. కొత్తగా ఏర్పాటైన ఎన్‌టిఆర్ జిల్లాతోపాటు కృష్ణా జిల్లాలో మొత్తం 60 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం కేవలం ఇద్దరు మాత్రమే దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పని చేయాల్సి ఉండగా, కేవలం 45 మంది మాత్రమే గత కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లాకు ఒకరు, కృష్ణాజిల్లాకు ఒకరు చొప్పున మాత్రమే ఉన్నారు. వీరు కూడా నిత్యం అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఉన్న ఒకరిద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కూడా తనిఖీలకు పరిమితం కాకుండా వివిధ కోర్టు కేసులు, రికార్డులు రాసుకోవడం, సమావేశాలు తదతర వాటికి హాజరవుతున్నారు.

ప్రశ్న : ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాల పరిస్థితి ఏమిటి ?

ఎన్‌టిఆర్ జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పాత ప్రభుత్వాస్పత్రిలో ఉంది. ఇది కనీసం ఇద్దరు సిబ్బంది కూర్చోవడానికి కూడా వీలు లేకుండా ఉంది. అటెండర్‌గానీ, గుమస్తాగానీ లేరు. లైసెన్స్ మంజూరుకు కంప్యూటర్ కూడా లేదు. ఇదే పరిస్థితి కృష్ణాజిల్లాలో కూడా నెలకొంది. పూర్తి స్థాయి కార్యాలయం ఇంకా అందుబాటులోకి రావాల్సి ఉంది. స్టాల్స్, షాపులు, ఇతర వ్యాపార సముదాయాలు వంటి వాటిని సమగ్రంగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సర్వే చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ ఎక్కడా జరగడం లేదు. ఎన్ని సంస్థలున్నాయో రికార్డు కూడా లేకుండా పోయింది. దీని వల్ల లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి సుమారు రూ.4 కోట్లు రావాల్సి ఉన్నా...ప్రస్తుతం కేవలం కోటి రూపాయలు మాత్రమే ఫీజుల రూపంలో వస్తోంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్లు రావాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం రూ.4 కోట్లు మాత్రమే వస్తున్నాయి. నెలకు క్రమంతప్పకుండా 12 శాంపిల్స్ తీయాల్సి ఉండగా, సిబ్బంది కొరతతో ఆ ప్రక్రియ సరిగా సాగడంలేదు.



నున్నలో పంచాయతీ కార్మికుల ప్రదర్శన

కనీస వేతనం రూ.20 వేలివ్వాలి

వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు .మహాసభలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రతినిధులు మాట్లాడారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.జ్యోతిబసు, సిఐటియు నాయకులు పి.వెంకటేశ్వరరావు, మాతంగి ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు జీ.వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి మోహన్, సత్తెమ్మ, జి.విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. ముందుగా యూనియన్ పతాకాన్ని సీనియర్ కార్మికురాలు పఠాన్ మాబు ఆవిష్కరించారు. మహాసభ అనంతరం స్వప్న థియేటర్ నుండి ర్యాలీ నిర్వహించారు.

నూతన కమిటీ

యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఎన్.సిహెచ్.శ్రీనివాస్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బి.భూషణం, సిహెచ్. సుబ్బారావు, కోశాధికారిగా ఆదూరి రాజు, ఉపాధ్యక్షులుగా సత్తెమ్మ, గజ్జల సతీష్, సీతారామరాజు, కార్యదర్శులుగా ప్రమీలా రాణి, రాజ్ కుమార్, సొంగా నాగరాజు, కమిటీ సభ్యులుగా మరో 17 మందిని మహాసభ ఎన్నుకుంది.

పెరిగిన తూనికలు, కొలతల శాఖ దాడులు

సంబంధించినవి ఉన్నాయి. చికెన్, మటన్, చేపల మార్కెట్లలో అవకతవకలపై 755 కేసులు, వేయింగ్ బ్రిడ్జిల కేసులు 355, పెట్రోల్ పంపుల అక్రమాలపై 281 కేసులు నమోదు చేశారు. షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో కూడా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వస్తువు బరువు, గడువు తేదీ, ధర, కస్టమర్ కేర్ వంటి వివరాలు లేకుండా పలు దుకాణాల వారు వస్తువులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు.


మహిళతో మాట్లాడుతున్న సింహాద్రి వికాస్

చంద్రబాబే అసలైన ఫ్యూడలిస్ట్ : వికాస్

ప్రజాశక్తి-నాగాయలంక

చంద్రబాబునాయుడే అసలైన ఫ్యూడలిస్ట్ అని అవనిగడ్డ నియోజకవర్గ వైసిపి యువనేత సింహాద్రి వికాస్ విమర్శించారు. నాగాయలంక మండలం సొర్లగొందిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ బాబు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే సింహాద్రికి మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. వికాస్ మాట్లాడుతూ అమరావతి రాజధాని అని చెప్పి వారి పార్టీ వారికి వారి వర్గానికి వారి మనుషులకు భూములను కట్టబెట్టారన్నారు. ఏ అర్హత లేని నారా లోకేష్‌ని మంత్రిని చేశారన్నారు. ఇలాంటి చర్యలు ఫ్యూడలిస్ట్‌కివి కాకుండా మరేమిటని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు పక్కన కూర్చుని ఫ్యూడలిస్ట్ కోటలు బద్దలు కొడతామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి పేరుతో తన వర్గానికి ఏకపక్ష లబ్ది చేకూర్చిన చంద్రబాబుకు, మూడు రాజధానులతో మూడు ప్రాంతాల అభివృద్ధి కోరుకుంటున్న జగన్మోహనరెడ్డి తేడా ప్రజలకు తెలుసన్నారు. వీరిద్దరిలో అసలైన ఫ్యూడలిస్ట్ ఎవరో పవన్ కూడా తెలుసుకోవాలన్నారు.

సామూహిక పూజ

ప్రజాశక్తి-నాగాయలంక

కార్తీక మాసం సందర్భంగా నాగాయలంక మండలం గణపేశ్వర గ్రామంలోని శ్రీదుర్గ గణపేశ్వరా స్వామి వారి దేవస్థానంలో సూర్య,చంద్ర,రాహు,కేతు గ్రహముల దోష నివారణార్థ సామూహిక 108 కలశల పూజా కార్యక్రమం జరిగింది.

ఫోటో్ రైట్ అప్,మోపి 2 రోగి కి ఆర్థిక సాయం అందిస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడు.

శ్యామ్ కిషోర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మోపిదేవి

మండల పరిధిలోని కె.కొత్తపాలెం గ్రామంలో నోటి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మత్తి శ్రీనివాసరావు ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో గ్రామస్తుల


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శ్యామ్‌కిశోర్‌నాయుడు

ద్వారావిషయం తెలుసుకున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ.7000 ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ఉదయం క్యాన్సర్ రోగి మత్తి శ్రీనివాసరావు ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మత్తి వంశీకృష్ణ, బచ్చు నరసింహారావు, పంద్రాజు మురళీకృష్ణ, చందన రాజేంద్రప్రసాద్, తుటారం మురళి, బాబి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు ఉప్పాల మృతి

చల్లపల్లి : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, చల్లపల్లి మాజీ వార్డు సభ్యులు ఉప్పాల భాస్కరరావు (65) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మండలి రాజా, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, చల్లపల్లి పంచాయతీ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీనియర్ నాయకులు సజ్జా చలపతిరావు, పరిసే మౌళి, తదితరులు జన్ను నాంచారయ్య తదితరులు ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భాస్కరరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

డిజిటల్ టెక్నాలజీతో న్యాయ సేవలు

జిల్లా జడ్జి అరుణసారిక

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

డిజిటల్ టెక్నాలజీ వినియోగించుకుని న్యాయ సేవలు అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ అరుణ సారిక అన్నారు.ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా అక్టోబర్ 31 నుండి ఈనెల 13 వరకు నిర్వహించిన పాన్ ఇండియా అవేర్ నేస్ కార్యక్రమ ముగింపు కార్యక్రమం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ సేవాసదన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి అరుణ సారిక మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 600 అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల లో ప్రజలకు న్యాయ సేవలు పట్ల మరింత అవగాహన కల్పించేందుకు న్యాయ అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని నల్సా విజన్ అన్నారు. చట్టపరమైన ప్రాతినిధ్యం అక్షరాస్యత, అవగాహన అందించడం, చట్టబద్ధంగా లభించే ప్రయోజనాలు, అర్హులైన లబ్ధిదారుల మధ్య అంతరాన్ని తగ్గించడం తద్వారా సమాజంలోని అట్టడుగు, మినహాయించబడిన సమూహాలకు చట్టబద్ధంగా అధికారం కల్పించడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అధిక భారం ఉన్న న్యాయవ్యవస్థ పై తీర్పు భారాన్ని తగ్గించేందుకు లోక్ అదాలత్ న్యాయ సేవా కేంద్రాలను బలోపేతం చేయడం జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. న్యాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను దగ్గరలోని న్యాయ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని వారిని న్యాయ సేవ అవగాహన కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలని ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. పాన్ ఇండియా అవగాహన కార్యక్రమాలలో ఉత్తమ సేవలందించిన ప్యానల్ లాయర్లకు పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా జడ్జి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, పదో అడిషనల్ జడ్జ్ నరసింహమూర్తి, డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎ.పద్మ, పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణసారిక

ఎంపి కృషితో క్రీడా మైదానంలో స్విమ్మింగ్ పూల్ : తోట

ప్రజాశక్తి-గన్నవరం

మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాల శౌరి కృషితో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానానికి నూతన హంగులు సంతరించుకోనున్నాయని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య తెలిపారు. ఆదివారం విజయవాడలోని గృహంలో ఎంపీ బాలశౌరిని గన్నవరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిశారు. తోట వెంకయ్యతో పాటు చిక్కవరం సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, గన్నవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, ఎమ్మెల్యే వంశీ ప్రతినిధి ఓలుపల్లి మోహనరంగా ఉన్నారు. తోట వెంకయ్య మాట్లాడుతూ గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిమ్ ఏర్పాటుతోపాటు పిల్లల కోసం రూ.10 లక్షలతో స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు చేసేందుకు ఎంపీ అంగీకారం తెలిపారని చెప్పారు. స్విమ్మింగ్ ఫూల్ వద్ద కోచ్‌తో పాటు నిర్వహణకు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. శాప్ ద్వారా వెంటనే అంచనాలు వేయించి పనులు ప్రారంభించాలని ఓలుపల్లి మోహనరంగా కు ఎంపీ సూచించారని చెప్పారు. జనవరి నాటికి పనులు పూర్తి చేయించి గన్నవరం ప్రజలకు అంకితం చేయాలని ఎంపీ ఆశించినట్లు తెలిపారు. మన్నే సుందరరావు గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా ఆయన వెంటనే ఓకే చెప్పారన్నారు. 30 పడకల ఆసుపత్రిని మరో 10 పడకలు పెంచి 40 పడక ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్నారు. చిక్కవరం సర్పంచ్ అన్నే లక్ష్మణరావు బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి కొండపైకి తారు రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూ.25 లక్షలు కేటాయించాలని కోరానన్నారు. తాను పరిశీలన చేసి అవసరమైన నిధులు సమకూరుస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వెంకయ్య తెలిపారు. ఇప్పటికే ఈ కొండపైకి రోడ్డు ఏర్పాటు చేసేందుకు అన్నే లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు ఎంపీ లావు కృష్ణదేవరాయులు రూ.15 లక్షలు, ఏలూరు ఎంపీ రూ.10 లక్షలు, తెలంగాణ ఎంపీ కేశవరావు రూ.30 లక్షలు ఇవ్వడానికి అంగీకారం తెలిపినట్లు లక్ష్మణరావు ఎంపీ దృష్టికి తెచ్చారన్నారు. గన్నవరం ప్రాంత అభివృద్ధి విషయంలో తాను పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ బాల శౌరి చెప్పారన్నారు. గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ తో పాటు కొన్ని ముఖ్యమైన గ్రామాల్లో తాను పాల్గొంటారని ఎంపీ చెప్పారన్నారు.

వంతెన మరమ్మతులకు రూ.5 లక్షలు : జోగి

గూడూరు : సుమారు 40 ఏళ్ల కింద నిర్మించిన కంకటావ కత్తులు వారి పాలెం మధ్య ఉన్న వంతెన బలహీనంగా మారింది. గత కొద్ది రోజులుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఆదివారం ఉదయం ఆ వంతెన స్వల్పంగా ధ్వంసమైంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ ఆ వంతెనను సందర్శించి పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడారు. ఆ వంతెన తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఎదం జరిగింది. అతి త్వరలోనే నూతన వంతెన నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. వంతెన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు ఈ రెండు గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో గూడూరు మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





బంటుమిల్లిలో జరిగిన దీక్షల్లో పాల్గొన్న రైతులు

దాళ్వాకు అనుమతివ్వాలని రైతుల దీక్ష

ప్రజాశక్తి-బంటుమిల్లి

సాగునీటి కోసం రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి నాల్గో రోజుకు చేరాయి. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన రైతులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. పెడన నియోజవర్గ టిడిపి ఇన్చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్, సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు సంఘీభావంగా మాట్లాడారు. తమది రైతుల ప్రభుత్వమని చెప్పిన వైసిపి పాలకులు వారిని మోసం చేస్తుండటం దారుణమని కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. పెడన నియోజవర్గం మొత్తం వ్యవసాయంపై ఆధారపడి ఉందని, వ్యవసాయానికి సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెబుతుండటం బాధాకరమని వై.నరసింహారావు అన్నారు. వెంటనే దాళ్వాకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, మండల అధ్యక్షులు కార్యదర్శి మలిసిడి శివరాం కుర్తి వెన్ను మండల అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, కృత్తివెన్ను మండల రైతు సంఘం కార్యదర్శి బుద్దన బాబి, సుజ్ఞాన జనార్ధనరావు, వంగల రాజు, మాజేటి శ్రీనివాసరావు, పత్తికొండ, రైతులు పాల్గొన్నారు

వేమన విగ్రహాన్ని పున:ప్రతిష్టించాలి

సాహితీ స్రవంతి డిమాండ్

ప్రజాశక్తి-పెదపారుపూడి


వేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని తొలగించి రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పెట్టడం దారుణమని సాహిత్రీ స్రవంతి నాయకులు అవిర్నేని వెంకటేశ్వరరావు, కన్వీనర్ ఎల్.సురేంద్ర ఖండించారు. గుడివాడ సుందరయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేమన విగ్రహాన్ని తొలగించటం తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. కో కన్వీనర్ బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విగ్రహాన్నిపునః ప్రతిష్టించే వరకు సాహితీ, ప్రజాసంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలన్నారు. నాయకురాలు చోడదవపు రూప మాట్లాడుతూ తెలుగు ప్రాచీన నాగరికతకు విశ్వాసాలను గౌరవించాలన్నారు.



టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెదపారుపూడి

గుడివాడ రూరల్ మండలానికి చెందిన వైసిపి బీసీ నేతలు


టిడిపిలో చేరిన బిసి నాయకులు

తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ పల్లపోతు బసవయ్య నాయకత్వంలో 100 మంది వైసిపికు చెందిన బిసి విభాగానికి చెందిన వారిని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు టిడిపిలోకి ఆహ్వానించారు. 15 ఏళ్ళుగా కొడాలి నాని వెంట నడిచిన తమను ఆయన మోసం చేశాడని, ప్రజల కోసం కష్టపడుతున్న చంద్రబాబుకు తామంతా మద్దతుగా ఉంటామని బీసీ నేతలు పేర్కొన్నారు. గుడివాడలో గడ్డం గ్యాంగ్ అరాచకాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గుడివాడలో కొడాలి నాని రాజకీయ సమాధికి నాంది పడిందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

మంచి నడతతోపాటు నడకా అవసరమే

● రెయిన్‌బో2కె రన్‌లో ప్రముఖులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బాలలకు మంచి నడతతో పాటు వాకింగ్, రన్నింగ్ వంటి వ్యాయామాలు కూడా అవసరమని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్ రీజనల్ హెడ్ రావి శ్రీనివాసరావు తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం సుమారు ఐదు వందల మంది బాల, బాలికలతో 2కె ఛాంపియన్స్ రన్‌ను నిర్వహించారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్ ఆవరణ వద్ద ప్రారంభమైన 2కె రన్ గురునానక్ కాలనీ ఫన్‌టైమ్స్ వరకు జరిగింది. ఈసందర్భంగా రావి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల ఆరోగ్య సంరక్షణ అవగాహన కోసం ఈ2కె రన్‌ను కాగ్నిజెన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. 6-17 సంవత్సరాల మధ్య బాల బాలికలు వారంలో కనీసం మూడు రోజులు అరగంట చొప్పున వ్యాయామం చేయడం వలన వారిలో చురుకుదనం పెరుగుతుందన్నారు. బాల బాలికలు రన్నింగ్, వాకింగ్, ఏరోబిక్స్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల కండరాలు, ఎముకలు పటుత్వంతో పాటు మానసికంగా దృడంగా , ఉల్లాసంగా మారతారని తెలిపారు. ఈకార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాంప్రసాద్, కాగ్నిజెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇ.శ్రీకాంత్, మూడవ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, డాక్టర్ మహ్మద్ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.



నేటి నుండి గ్రంధాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-నందిగామ

ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు నందిగామ బ్రాంచి గ్రంధాలయ వారోత్సవాలు జరుగుతాయని నందిగామ గ్రంధాలయ అదికారి జి.ఉమారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, వకత్వ పోటీలు నిర్వహించి చివరి రోజు నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావుచే బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : సమాజ సేవ చేయాలన్న మంచి ఆలోచనతో జగ్గయ్యపేట నియోజకవర్గంలో 15 సంవత్సరాల నుండి మారేళ్ళ అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్మారక ట్రస్టు ద్వారా పుల్లారెడ్డివారి కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలు అమోఘమని శాసనసభ్యులు సామినేని ఉదయ భాను కొనియాడారు. మండలంలోని చిట్యాల గ్రామంలో మారెళ్ళ అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్మార్ట్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పుల్లారెడ్డి సారధ్యంలో శంకర నేత్రాలయం గుంటూరు వారి సౌజన్యంతో ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో పలువురుకి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లకు రికమెండ్ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మారెళ్ళ పుల్లారెడ్డి బ్రదర్స్, ఆకుల శ్రీనివాస్, గ్రామసర్పంచ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉదయభాను

పత్తి కాటాలలో మోసాలు...
నష్టపోతున్న రైతులు




● ముమ్మరంగా పత్తి తీతలు ●సిసిఐ కేంద్రాలు తెరుచుకునేనా ?

ప్రజాశక్తి-నందిగామ

పత్తి తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామాలలో పత్తి పట్టాలపై పోసి ఆరబెడుతున్నారు. సిసిఐ కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవటం వల్ల రైతులకు ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని రైతులు మోసపోతున్నారు. వ్యాపారులు కాటాలలో చిఫ్ లు పెట్టి పచ్చి మోసం చేస్తున్నారు. ఖమ్మం,తల్లాడ నుండి కొంతమంది వ్యాపారులు నందిగామ పరిసర ప్రాంతాలలో విచ్చలవిడిగా పత్తి కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు గుడ్డి పత్తి 5 వేలు, తేమ ఉంటే 6 వేలు, నాణ్యమైపత్తి 7800 చొప్పున కొనుగోళ్ళు చేస్తున్నారు. ఖమ్మం మార్కెట్ యార్డులలో క్వింటా 8800 చోప్పున కొంటున్నారు. నందిగామ మండలం కేతవీరునిపాడు గ్రామాలలో పత్తి కాటాలో చిప్ పెట్టి రిమోట్ ద్వారా క్వింటా కు 20 కేజిలు తగ్గియటంతో రైతులు గుర్తించి సదరు వ్యాపారికి దేహశుద్ధి చేసి పోలీసు కేసు పెట్టడానికి ప్రయత్నించారు. అలాగే పెనుగంచిప్రోలు మండలంలో ఒక రైతును మోసం చేయటంతో సదరు వ్యాపారికి తగిన గుణపాఠం చెప్పారు. పత్తి కొనుగోళ్ళు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని రైతులు మోసపోతున్నారు. ప్రభుత్వం సిసిఐ కేంధ్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. క్వింటా పత్తి కి ప్రభుత్వ మద్దతు ధర కంటే బహిరంగ ధర అధికంగా ఉంది. సిసిఐ మద్దతు ధర క్వింటా రూ.6080 పొట్టి పింజ, రూ. 6380 పొడుగు పింజ ప్రభుత్వం చెల్లిస్తామని ప్రకటించింది. 2021 ఖరీఫ్లో సాగు చేసిన పత్తి బయట మంచి ధర లభించింది. ఈ ఏడాది మార్చిలో 10 వేలు, ఎప్రిల్ లో 12500 పైనే కొనుగోలు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర తో పోలిస్తే రెట్టింపు అయింది. అప్పటికే రైతుల కేతి నుండి దళారుల చేతికి పంట చేరింది. దీంతో రైతుల కంటే వ్యాపారులే ఎక్కువగా లాభాలు పొందారు. అక్టోబర్ లో సిసిఐ కేంధ్రాలు తెరవాల్సి ఉండగా అధికారులు స్పందించటం లేదు. ప్రతి ఏటా కాటన్ కార్పోరేషన్ కేంద్రాలలో పత్తి కొనుగోళ్ళు జరిగేవి. కరోనాతో సిసిఐ కేంధ్రాలు కనుమరుగవడంతో పత్తి ప్రైవేటు వ్యాపారుల చేతికి చేరుతుంది. రైతుల వద్ద తక్కువ ధరలకు,వ్యాపారుల వద్దకు చేరగానే ఎక్కువ ధరకు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం నందిగామ, జగ్గయ్యపేట,కంచికచర్ల, గంపలగూడెం,మైలవరం మార్కెట్ యార్డులలో సిసిఐ కేంద్రాలు తెరిచేవారు. పత్తి కొనుగోళ్ళు రెండు మూడు సంవత్సరాలు లేకపోవడంతో గత మూడు సంవత్సరాలు నుండి మార్కెట్ యార్డులకు కోట్లలో ఆదాయానికి గండి పడుతుంది.

కాటాలలో మోసాలు జరుగుతున్నాయి

జవ్వాజి నారాయణ ప్రసాద్, పత్తి రైతు ,కొణతమాత్మకూరు



పత్తి కొనుగోళ్ళు ప్రైవేటు వ్యాపారులు ఏక్కువ ధర చెల్లిస్తామని చెప్పుతూ కాటాలలో మోసాలకు పాల్ప పడుతున్నారు. కొంతమంది వ్యాపా రులు ఎలక్ట్రానిక్ కాటాలలో చిప్న పెట్టి పత్తి కాటాలలో కేజీలు తగ్గిస్తున్నారు. కావున రైతులు వారి స్వంత కాటాలు తెచ్చుకుని పత్తి అమ్ముకోవాలి. ప్రభుత్వం మార్కెట్ యార్డులలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

పత్తి కొనుగోళ్ళు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పొంగులూరి నరసింహయ్య, మునగచర్ల సర్పంచ్



మార్కెట్ యార్డులలో పత్తి కొనుగోళ్ళు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.ఈ ఏడాది ఆకాల వర్షాల వల్ల పత్తి తెగుళ్ళు వ్యాపించి పూత, పిందె రాలి యకరానికి నాలుగైదు క్వింటాళ్ళు మించి దిగుబడి రావటం లేదు.పత్తి రైతులు నష్ట పోతున్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారు. తక్షణమే సిసిఐ కేంధ్రాలు ఏర్పాటు చేయాలి.

త్వరలో సిసిఐ కేంద్రాలు ఏర్పాటు

శ్రీనివాసరావు, ఎఎంసి కార్యదర్శి, నందిగామ



జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, గంపల గూడెం, మైలవరం మార్కెట్ యార్డులలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కు సిసిఐ సంస్థ నుండి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ ధర కంటే బహింగంగా ఎక్కువగా ధర ఉండటంతో సిసిఐ ఏర్పాటు లో అలస్యం అవుతుంది. వ్యాపారులు తక్కువ ధరలకు కొన్నప్పుడే రైతులు పత్తిని సిసిఐ కేంధ్రాలకు తీసుకువస్తారు. ధర వ్యతాసాలు పరిశీలించి యార్డులలో కొనుగోళ్ళు జరుపుతాం.



ప్రణాళికా విభాగం మరింత బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలోని నగరాలు అభివృద్ధికి పట్టణ ప్రణాళిక విభాగం కీలకమని ఈవిభాగంలో తగినంత సిబ్బంది ఉన్నా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అషోసియేషన్ సర్వసభ్య సమావేశం పటమటలోని ఓకళ్యాణమండపంలో జరిగింది. విశాఖ వీఎంఆర్‌డిఎ (విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏపీవో పి.నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు తమ సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి చేయడం ద్వారా వ్యవస్థ మరింత బలోపితం అవుతుందని అన్నారు. అంతకుముందు అసోసి యేషన్ సభ్యుల నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఏకగ్రీవంగా జరిగిన ఈఎన్నికలో రాష్ట్ర అధ్యక్షు లుగా కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మురళిగౌడ్, అబ్దుల్ సత్తార్ వై.శ్రీనివాస్ ఎన్నిక కాగా ప్రదాన కార్యదర్శిగా మోహన్‌బాబు, కోశాధికారిగా కృష్ణను సభ్యులు ఎన్నుకున్నారు.

కృష్ణా, గుంటూరు జోన్ అధ్యక్షులుగా వశీంబేగ్ ...

నాలుగు జోన్లుకు జరిగిన ఈఎన్నికలలో కృష్ణా గుంటూరు జోన్‌కు వీఎంసి టౌన్ ప్లానింగ్ అధికారి వశీంబేగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పశ్చిమ తూర్పు గోదావరి జిల్లాల జోన్ -2కి నూజివీడు అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకయ్య ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో శ్రీకాకుళం డీటీసీపీ అధికారి కిశోర్, రంగ ప్రసాద్, తాడిగడప ఏసీపీ సుబ్బారావు మతిన్, లక్ష్మీనారాయణ, గిరి పలువురు బిల్డింగ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా క్యూ లైనులో భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం అందులోనూ కార్తీక మాసం కావటంతో శ్రీ అమ్మవారి దర్శనార్థం భక్తులు విశేషంగా విచ్చేసి, శ్రీ అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రన వావరణార్చన, చండీ హోమం, శాంతి కళ్యాణం మరియు ఇతర సేవల యందు విశేషంగా పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

